ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 23 జనవరి 2024



ఇచ్ఛాపురంలో శోభాయాత్ర

శ్రీరామ జయము

● జిల్లాలో ఆధ్యాత్మిక సందడి ● రామాలయాల్లో ప్రత్యేక పూజలు ● రాముని చిత్రపటాలతో శోభాయాత్రలు

అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జిల్లాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జై శ్రీరామ్ నినాదాలతో జిల్లా మార్మోగింది. రామ భజనలు, శోభాయాత్రలు, కోలాటాలు, ప్రత్యేక పూజలతో గ్రామాలు, పట్టణాలు శోభిల్లాయి. అంతా రామమయమే కనిపించింది. ఆలయాలు, ఇళ్లల్లో దీపాలు వెలిగించారు. అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠను జిల్లా ప్రజలు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించడంతో పాటు వివిధ రూపాల్లో ఆరాధించారు. శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం, జలుమూరు, ఎచ్చెర్ల తదితర మండలాల్లో ఉదయం నుంచే తిరువీధి, భజన, ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. వీధుల్లో జైశ్రీరామ్ నామస్మరణతో భక్తులు హోరెత్తించారు. అయోధ్య ఆలయ ప్రారంభం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, రాముడు గొప్పతనాన్ని వివరిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

-శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి



ఎచ్చెర్ల: కుశాలపురంలో..



సోంపేట పట్టణంలో శ్రీరాముని వేషధారణలో చిన్నారి



వజ్రపుకొత్తూరు: నువ్వలరేవులో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



అయోధ్యలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు..



కవిటిలో..



జలుమూరు: శ్రీముఖలింగంలోని రామ మందిరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శ్రీకాకుళం కల్లేపల్లిలో: శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి, తదితరులు



పలాస రూరల్: మొదుగులపుట్టిలో..



శ్రీకాకుళం ఉమారుద్రకోటేశ్వరాలయ ఘాట్ వద్ద..



నరసన్నపేటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీలపై జగన్‌రెడ్డి తీరు దుర్మార్గం

● సమస్యలపై వారు ఆందోళన చేస్తే నేరమా?
● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



అచ్చెన్నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ నాయకులు

టెక్కలి, జనవరి 22: అంగన్‌వాడీలపై ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని శ్యామసుందరాపురం గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో అంగన్‌వాడీలు ఆందోళన చేయడం నేరమా అని ప్రశ్నించారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించే అధికారం ఎవరిచ్చారన్నారు. అంగన్‌వాడీల కన్నీటిలో జగన్‌రెడ్డి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి వైసీపీ ప్రభుత్వం పాతరేసిందన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం ఆదాయం పెరగలేదు సరికదా లక్షల కోట్లు అప్పులు పెంచిందని విమర్శించారు. వైసీపీ ముఖ్య నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు సంపద పెరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో గనుల దోపిడీ, ఇసుక దందా, భూకబ్జాలు పెరిగిపోయాయన్నారు. మరోవైపు దళితులపై దాడులు, బీసీలు అనిచివేతకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 55కు పైగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాల్లా మార్చేశారని, ఏ ఒక్కరికి ఒక్క రూపాయి రుణం కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఎలాగూ గెలవలేమని తెలిసిన వైసీపీ నాయకులు చివరికి దొంగ ఓట్లు చేర్పించి పలుచోట్ల పట్టుబడ్డారని తెలిపారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం మరో 80 రోజుల్లో ఏర్పడనుందని తెలిపారు. ఈ విషయం గమనించిన వైసీపీ నేతలకు నిద్ర పట్టడం లేదన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి నిర్వాకం మూలంగా రాష్ట్రానికి ఒక కొత్త పరిశ్రమ కూడా రాలేదని, వచ్చిన పలు పరిశ్రమలు వెనక్కు మళ్లాయని మండిపడ్డారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు..

శ్యామసుందరాపురంలో వైసీపీకి చెందిన వైశ్య సంఘం ముఖ్య నాయకులు జామి నర్సింహమూర్తి, తంగుడు విష్ణు తదితరులు సోమవారం టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధి జరిగిందే తప్ప వైసీపీ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, నాయకులు హనుమంతు రామకృష్ణ, చాపర గణపతిరావు, మెండ దమయంతి, గండి సూర్యనారాయణరెడ్డి, ఉపేంద్ర రెడ్డి, పొట్నూరు వినాయకరావు, కొత్తూరు హరి, మామిడి రాము, కోళ్ల కామేసు, దోని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు 450 మంది అంగన్‌వాడీలు

● అక్కడ వారిని అరెస్టు చేసిన పోలీసులు
● తొలగిస్తున్నామంటూ అధికారుల నోటీసులు

శ్రీకాకుళం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్వాడీలు సమ్మెలో ఉన్నారు. ఇందులో సోమవారం 450 మంది వరకు విజయవాడ చేరుకున్నారు. అక్కడ వారిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో చాలారోజుల నుంచి 6,180 మంది అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెలో ఉన్నారు. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేదిలేదంటూ నిరసన చేస్తున్నారు. వీళ్లలో అధికమందిని తొలగిస్తూ ఐసీడీఎస్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫలానా కారణంతో తొలగిస్తున్నామంటూ ఐసీడీసీ ప్రాజెక్టుల వారీగా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఉత్తర్వులను జారీచేశారు. ఆయా ఉత్తర్వులను అంగన్వాడీలు తీసుకునేందుకు సుముఖత చూపించలేదు. మరికొంత మంది స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఉత్తర్వు కాపీలను అంగన్వాడీ కేంద్రాల గోడలకు, వారి ఇంటి గోడల కు అధికారులు అతికించి.. వాటిని ఫొటో తీసి వెళ్లిపోయారు. ఇలా వందలాది మందికి ఉత్తర్వులు జారీచేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం కక్ష గట్టి అంగన్వాడీలను అణిచివేయాలని చూస్తోందని.. జిల్లా అధికారులు కూడా వంతపలుకుతున్నారని జిల్లా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్యాణి వెల్లడించారు. ఎంతమంది అంగన్వాడీలను తొలగించారన్నది సమాచారం తెలుసుకునేందుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

జిల్లాకు చేరుకున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



● నేడు ఇచ్ఛాపురంలో పర్యటన

శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి/ఇచ్ఛాపురం, జనవరి 22: ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ వరకు చేపట్టనున్న పర్యటన కోసం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. ఈమెకు డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు స్వాగతం పలికారు. షర్మిల శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్‌లో బస చేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం బయల్దేరి వెళ్తారు. అక్కడ వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తారు. పొందూరు నేత కార్మికుల సమస్యలపై చర్చావేదిక నిర్వహిస్తారు. అలాగే ఉద్దానం కిడ్నీ బాధితులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తారు. షర్మిల పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు పరమేశ్వరరావు తెలిపారు. ఇచ్ఛాపురం సురంగిరాజా మైదానం ఎదురుగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విజయ స్థూపాన్ని సోమవారం పరిశీలించారు. అలాగే, ఆర్‌జే ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్ల సంఖ్య 18,59,910

● ఏడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం
● 55,755 ఓట్ల తొలగింపు
● 16,100 మంది సర్వీస్ ఓటర్లు
● తుదిజాబితా విడుదల

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లా ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్ సోమవారం విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 18,59,910 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. మొత్తం 8 నియోజకవర్గాల్లో ఏడుచోట్ల (ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట) మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో మాత్రం పురుష ఓటర్లే ఎక్కువ. మొత్తం 18,59,910 మంది ఓటర్లకు గానూ పురుష ఓటర్లు 9,22,442 మంది, మహిళా ఓటర్లు 9,37,329 మంది, థర్డ్ జెండర్స్ 139 మంది ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ఓటర్ల జాబితాను విశదీకరిస్తే...

ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఎనిమిది నియోజకవర్గాల్లో 70 మంది ఉన్నారు. యువ ఓటర్లు (18 నుంచి 19 ఏళ్లు) 35,037 మంది, వృద్ధ ఓటర్లు (80ఏళ్లు పైబడి) 29,042 మంది, దివ్యాంగ ఓటర్లు 20,732 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 16,100 మంది ఉన్నారు. ఇందులో 15,546 మంది పురుషులు, 554 మంది మహిళలు ఉన్నారు. సర్వీసు ఓటర్లు అనేవి మొత్తం ఓటర్ల జాబితాకు అదనంగా ఉంటాయి.

55,755 ఓట్ల తొలగింపు

గతేడాది అక్టోబరు 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసిన జాబితాతో ప్రస్తుత తుది జాబితాను పరిశీలిస్తే.. మొత్తం 55,755 ఓట్లను తొలగించారు. ఇందులో మరణించిన వారు 18,215 మంది, ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో చోటకు లేదా ఇతర జిల్లాలకు ఓటును మార్పుచేయించుకున్న వారు 30,754 మంది, డూప్లికేట్ ఓటర్లు 6,786 మంది ఉన్నారు.

ఇంటి నెంబర్లు సరి చేశారు..

ఒకే ఇంటి నెంబర్లు, జీరో ఇంటి నెంబర్లతో జిల్లాలో భారీగా ఓటర్లు ఉన్నట్లు గతంలో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో వీటిని కొంతమేర పరిష్కరించారు. జీరో ఇంటి నెంబర్ గల ఓటర్లు 21,820 మంది ఉండగా ఇందులో 308 మంది ఓటర్ల ఇంటి నెంబర్లను సరిచేసి జాబితాలో రూపొందించాల్సి ఉంది. మిగిలినవి సరిచేశారు. అలాగే ఒకే ఇంటి నెంబర్లతో 64,814 మంది ఓటర్లు ఉండగా ప్రతి ఓటరు ఇంటి నెంబర్‌ను సరిచేశారు.

జిల్లా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జండర్స్	మొత్తం
ఇచ్ఛాపురం	129579	136427	17	266023
పలాస	106817	111365	26	218208
టెక్కలి	116944	117383	10	234337
పాతపట్టణం	111301	111843	13	223157
శ్రీకాకుళం	133772	136252	31	270055
ఆమదాలవలస	95539	97005	16	192560
ఎచ్చెర్ల	122169	120455	13	242637
నరసన్నపేట	106321	106599	13	212933
మొత్తం	9,22,442	9,37,329	139	18,59,910

ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు..

ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏ నియోజకవర్గంలో అయితే బల్క్‌గా ఓట్ల తొలగింపు కోసం దరఖాస్తులు అందాయో వాటిపై దృష్టిసారించాం. టెక్కలి నియోజకవర్గంలో ఫారం-7 దరఖాస్తులు తప్పుగా సమర్పించారు. దీనికి సంబంధించి నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదుచేశాం. గత డిసెంబరు 9వరకు స్వీకరించిన దరఖాస్తులకు మాత్రమే జాబితాలో చోటు ఉంది. ఓటు హక్కులేని వారు ఇప్పటికీ దరఖాస్తు చేసుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్లు వేసేంత వరకు ఓటు కోసం, లేదా మార్పులు చేర్పులు కోసం దరఖాస్తు అందజేయవచ్చు. దేశంలోనే సర్వీసు ఓటర్లు అధికంగా ఉన్న ఇరవై జిల్లాల్లో శ్రీకాకుళం కూడా ఉంది. ఓటర్ల జాబితా రూపకల్పనలో అత్యంత పారదర్శకతతో పనిచేసిన సిబ్బందికి అభినందనలు' అని తెలిపారు.

శ్రీరామ జయము

● వాడవాడలా మార్మోగిన జైశ్రీరామ్
● గ్రామాలు, నగరాల్లో ఉట్టిపడిన ఆధ్యాత్మికత
● ప్రత్యేక పూజలు, భజనలు, తిరువీధులు

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఆధ్యాత్మికత ఉట్టి పడింది. జైశ్రీరాం నామనామంతో వీధులన్నీ మార్మోగాయి. రామ మందిరాలు, రామాలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, జపాలు, పారాయణలు చేపట్టారు. తిరువీధి మహోత్సవాలు, ఇళ్ల ముంగిట దీపాలంకరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. రోజంతా ఆధ్యాత్మిక చింతనలో ప్రజలు పునీతులయ్యారు.

-ఆంధ్రజ్యోతి బృందం


కోటబొమ్మాళి: టీడీపీ కార్యాలయంలో శ్రీరాముని చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు


హిరమండలం: సుభలయ గ్రామంలో శోభాయాత్ర


పాతపట్నం: ఎరుకోల గ్రౌండ్స్‌లో శ్రీరాముని పూజ, హోమం


కంచిలి: అర్జునాపురంలో శోభాయాత్ర


సోంపేట : కొర్లాంలో శ్రీరాముని చిత్ర పటాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న మహిళలు


సరుబుజ్జిలి: తెలికిపెంటలో..


పొందూరు: ర్యాలీలో పాల్గొన్న భక్తులు


రణస్థలం: అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న భక్తులు


జి.సిగడాం: పెంట రామాలయంలో..


నందిగాంలో శ్రీరాముని చిత్రపటం ఊరేగింపు


మెళియాపుట్టి: పెద్దపద్మాపురంలో..


ఆమదాలవలసలో మహిళల కోలాటం


గార: శోభాయాత్ర చేస్తున్న భక్తులు


జలుమూరు: అబ్బాయిపేట ఆలయంలో..


కొత్తూరు: కురిగాంలో తిరువీధి


పలాస: రైల్వేకాలనీ సీతారామాలయంలో రాముడు బాణం సంధిస్తున్నట్లు వేసిన ముగ్గు


టెక్కలి: విద్యార్థుల వేషధారణ


సంతబొమ్మాళి: వల్లేవలసలో..


ఎల్ఎన్‌పేట: శ్యామలాపురంలో..


పలాస: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మదర్‌థెరిసా విద్యాలయం ఆధ్వర్యంలో మానవహారం


ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో హరేరామ భజన


అరసవల్లి: ఆదిత్యుని ఆలయంలో మహిళల కోలాట ప్రదర్శన


ఎచ్చెర్ల: ఎస్ఎంపురంలో దీపాలంకరణ చేస్తున్న టీడీపీ సీనియర్ నేతలు చౌదరి నారాయణమూర్తి, చౌదరి ధనలక్ష్మి తదితరులు


శ్రీకాకుళం క్రైం: కిష్టప్పపేటలో పూజలు చేస్తున్న శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


60 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పలాసరూరల్: బ్రాహ్మణతర్లా జడ్పీ ఉన్నత పాఠశాలలో 1963లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం నిర్వహించారు. సుమారు 60 ఏళ్ల కిందట చదువుకున్న వారంతా ఒకచోట చేరి సందడి చేశారు. ఈ సందర్భంగా రూ.30 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను పాఠశాలకు అందజేశారు. పూర్వ విద్యార్థి, ఇంపాక్ట్ ఇంటర్నేషన్ ప్రేరణ సంస్థ డైరెక్టర్ డి.సుబ్బారావు విద్యార్థులకు మనోవికాసంపై పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వైకుంఠరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం దారుణం

వజ్రపుకొత్తూరు: అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం దారుణమని సీపీఎం జిల్లా నాయకుడు బి.ఆనందరావు అన్నారు. సోమవారం నగరంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి గాను శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా తొలగించే చర్యలు శోచనీయమన్నారు.

యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

పలాసరూరల్: స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాలలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో పార్ట్ టైమ్ యోగా శిక్షకులుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న స్త్రీ,పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు హోమియో వైద్యాధికారి దుర్గాప్రసాద్ పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులకు ఒక్కో పోస్టు ఉన్నాయని, యోగాలో డిప్లమో, పీజీ డిగ్రీ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, లేదా అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 24న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ నిమిత్తం బ్రాహ్మణతర్లా హోమియో వైద్య శాలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 94401 68430 నెంబరులో సంప్రదిం చాలన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పలాసరూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మాకన్నపల్లిలో వైఎస్ఆర్ విలేజ్‌హెల్త్ క్లినిక్, ఆర్బీకేలను సోమవారం ప్రారంభించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే సమస్యలను పరిష్కరిస్తున్నామ న్నారు. రైతులకు భూహక్కు పట్టాలు, ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదనరావు, సర్పంచ్ సైని దేశయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తే చర్యలు

నరసన్నపేట: నర్సింగ్ హోమ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లకు అనుమతి తప్పనిసరని, లేకుంటే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ఎం.ప్రసాదరావు అన్నారు. సోమవారం పట్టణంలో పలు ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ల్యాబ్ లను రెన్యువల్ చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా క్లినిక్ పేరుతో ఆసుపత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. డీపీఎంవో వాన సురేష్‌కుమార్, పద్మరాజు పాల్గొన్నారు. ● **కోటబొమ్మాళి:** కొత్తపల్లి పీహెచ్‌సీని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.ప్రసాదరావు ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో అమలవుతున్న జాతీయ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. హెచ్‌డీఎస్ నిధులను ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. రికార్డులను, వైద్య పరికరాలను, మందులపై ఆరా తీశారు. డాక్టర్ మనీష తదితరులున్నారు.

ఆదర్శనీయుడు లెనిన్

నరసన్నపేట: విప్లవాలకు లెనిన్ ఆదర్శనీయుడని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నేతింటి నీలంరాజు అన్నారు. లెనిన్ శతశయంతి ఉత్సవాల సందర్భంగా డోలపేటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశం, రాష్ట్రంలో మతోన్మాదులు ఫ్యాకనిస్టులు రాజ్యమేలుతున్నారని, వీరికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

చెల్లాయివలస(పోలాకి): కల్లు గీత కార్మిక సంఘం ఐక్యత, హక్కుల సాధన కోసం ఈనెల 30, 31 తేదీల్లో తణుకులో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు కోట అప్పారావు, దుబ్బక కోటేశ్వరరావు కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ. కల్లుగీత కార్మికులంతా సభలకు తరలిరావాలని కోరారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన పామోటి భాస్కరరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా టెక్కలికి చెందిన జగద్ధాత్రి కార్పెంటర్ల సంఘం ప్రతినిధులు సోమవారం రూ.40 వేలు సాయం అందించారు. అత్యవసర శస్త్రచికిత్స కోసం టెక్కలితో పాటు జిల్లాలోని ఇతర విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు ఈ సాయం అందించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు సింహాద్రి కుమార్, ప్రధాన కార్యదర్శి కదంబ తారకేశ్వరరావు, కొండూరు సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

పాతపట్నం: కొరసవాడ సమీపంలో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న బోరుభద్ర గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ యాశిన్ తెలిపారు. వీరి నుంచి ద్విచక్రవాహనాన్ని, రూ.1650 విలువ చేసే 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉండాలి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీని ఓడించేందుకు ప్రజలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా నలుమూలల నుంచి టీడీపీ శ్రేణులు వచ్చి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ రెడ్డి ప్రభుత్వం మరో మూడు నెలల్లో ఎన్నికలకు సిద్ధం అవుతుందని, మనమంతా అప్రమత్తం కావాలన్నారు. నందిగాం మండలం కల్లాడ పంచాయతీ మదనాపురం గ్రామానికి చెందిన పైల అప్పలస్వామి, తాతారావు తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే కురుడు పంచాయతీ పాకివలస గ్రామానికి చెందిన ముస్లిం మహిళలు అచ్చెన్నాయుడు ను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ● శ్రీజగన్నాథ పురానికి చెందిన సాను మహంతి ఆనందరావు తల్లి ఇటీవల అనారోగ్యంలో మృతి చెందగా ఆయనను అచ్చెన్నాయుడు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బెండి అన్నపూర్ణ, కొర్రాయి మల్లేశ్వరావు, పట్నాన భాస్కరరావు, కూన జగన్నాథరావు, దుద్దు దానయ్య పాల్గొన్నారు.

శివాజీ హయాంలో పల్లపు ప్రాంతాల అభివృద్ధి


మాట్లాడుతున్న వజ్జ బాబూరావు

కాశీబుగ్గ: మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో పల్లపు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని నాలుగో వార్డు శాంతినగర్‌లో పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో రానున్నది టీడీపీ ప్రభుత్వమని, ఎవరూ వైసీపీ నేతలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో గాలి కృష్ణారావు, సూర్యనారాయణ, రాంబాబు, సురేష్, రామకృష్ణ, కొత్త సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా టీడీపీ విజయానికి కృషి చేయాలి

పలాసరూరల్: లొద్దభద్ర, తర్లాకోట, అల్లుకోల పంచాయతీల్లో సోమవారం 'పల్లెపల్లెకు టీడీపీ' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకుడు పీరికట్ల విఠల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని సూచించారు. కార్య క్రమంలో నాయకులు దువ్వాడ సంతోష్, తమ్మినేని గంగారామ్, దువ్వాడ హర్ష, బి.సూర్యకృష్ణంరాజు, పోలాకి పాపారావు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

టెక్కలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ మట్ట సుందరమ్మ అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.30 గంటల వరకు సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు అధికా రులు ప్రకటించారు. అధికార పార్టీకి 21 మంది ఎంపీటీసీ లున్నప్పటికీ ఒక్కరు కూడా సమావేశానికి హాజరుకాలేదు. ప్రస్తుతం టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జడ్పీటీసీ దువ్వాడ వాణి వర్గాలుగా వ్యవహరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో సమావేశానికి ఇరువర్గాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకాలేదు. ఎంపీపీ, పలువురు అధికారులు హాజరైనప్పటికీ సమావేశం ప్రారంభం కాకపోవడంతో వారంతా వెనుదిరిగారు. వైసీపీలో వర్గాల పోరే ఈ సమావేశం వాయిదాకు కారణంగా పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

29న ఆదివాసీల చలో టెక్కలి

టెక్కలి: బెంతుఒరియాలతో ఆదివాసీల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని, దీనిని వ్యతిరేకిస్తూ ఈనెల 29న చలో టెక్కలి నిర్వహించ నున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు వాబ యోగి తెలిపారు. ఈ మేరకు సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బెంతు ఒరియాలు లేరని, అయితే ప్రభుత్వం వారిని ఎస్టీలుగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. తెంబూరు రోడ్డు నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ అప్పన్న, బైదిలాపురం సింహాచలం, గేదెల శేషగిరి, ఆనందరావు, పెద్దింటి నేపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా

పలాసరూరల్: అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. మందస మండలంలో పురుష ఓటర్లు 33,883 కాగా మహిళా ఓటర్లు 34,809 మంది, పలాసలో పురుషులు 40,521 కాగా, మహిళలు 42,677 మంది, వజ్రపుకొత్తూరులో పురుషులు 32,413, మహిళలు 33,879 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, కమిషనర్ నాగేంద్ర కుమార్, ఎన్నికల డీటీ రాంబాబు, డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** ఓటర్ల తుది జాబితాను నరసన్నపేట నియోజవర్గ ఏఆర్వో సింహాచలం సోమ వారం విడుదల చేశారు. నియోజవర్గంలో 290 పోలింగ్ స్టేషన్‌లో నాలుగు మండలాల్లో 2,12,933 ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. జలుమూరు మండలంలో 50,875, నరసన్నపేటలో 64,242, సారవకోటలో 43,736, పోలాకి మండలంలో 54,079 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లు జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. ● **నందిగాం:** మండలంలో ఓటర్ల తుది జాబితాలను సోమవారం ప్రచురించారు. తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి వైపీ పద్మావతి నేతృత్వంలో బీఎల్‌వోలు 88 పోలింగ్ కేంద్రాల్లో వీటిని వేలాడదీశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ దుర్మరణం


ఉమామహేశ్వరి (ఫైల్)

ఎచ్చెర్ల: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గిరిజాల ఉమామహేశ్వరి (60) సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఎచ్చెర్ల పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటకు సమీపంలో నివాసముంటున్న ఉమామహేశ్వరి ఉదయం 9.15గంటల సమయంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎదురుగా ఆటో దిగారు. రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు వెళ్తున్న మోటారు బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రంగా గాయపడడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. 40 ఏళ్ల కిందట టైపిస్ట్‌గా విధుల్లో చేరిన ఆమె ప్రస్తుతం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.ఉమామహేశ్వరి మృతితో కళాశాలలో విషాద ఛాయలు అలము కున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్‌ఆర్‌డీఎల్‌పీ క్రిస్టియన్, అధ్యాపకులు, సిబ్బంది సంతాపం తెలిపారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

తరచూ ప్రమాదాలు

పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డుపై మలుపు వద్ద తరచే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలు రెండు పక్కపక్కనే ఉన్నాయి. విద్యా సంస్థలు ఉన్న చోట రోడ్డుపై కనీసం స్పీడ్ బ్రేకర్ కూడా లేకపోవడంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాల స్పీడ్‌ను నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటుచేయాలని పాలిటెక్నిక్ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదృశ్యమైన వ్యక్తి.. శవమై తేలాడు


సోమేశ్వరరావు (ఫైల్)

నందిగాం: నందిగాం ఎస్సీ వీధికి చెందిన కొన్న సోమేశ్వరరావు(52)ఈనెల 17నఅదృశ్యం కాగా సోమవారం శవమై లేలాడు. సోమేశ్వరరావు ఈనెల17న ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీకోసం పరిసర గ్రామాలు, బంధువులు ఇళ్లలో వెతికారు.అయినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఈలోగా సోమవారం ఉదయం వజ్రపుకొత్తూరు మండలంలోని బెండిగేటువంతెన సమీపంలో వాగులో శవమై కనిపించాడని పలాస రైల్వేఎస్ఐ షరీఫ్ తెలిపారు.పూండి స్టేషన్ మాస్టర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సోమేశ్వరరావుకు భార్య జయప్రద, కుమారుడు ఉదయ్, వివాహమైన కుమార్తె ఉన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

శ్రీకాకుళం క్రైం: భైరివానిపైటకు చెందిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. టూటౌన్‌పోలీసుల కథనం మేరకు.. స్థానిక భైరివానిపైటకు చెందిన బంగారు లక్ష్మణరావు (52) ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికొచ్చి గొడవపడేవాడు. ఆదివారం భార్య సరస్వతి భర్త లక్ష్మణరావును నిలదీసింది. దీంతో మనస్థాపం చెందిన లక్ష్మణరావు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. అపస్మారక స్థితిలో ఉన్న భర్తను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న లక్ష్మణరావు సోమవారం మృతిచెందాడు.భార్య సరస్వతి టూటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్ఐ లక్ష్మి కేసు నమోదు చేశారు. లక్ష్మణరావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రసాయన పరిశ్రమలో కార్మికుడు ..

రణస్థలం: పైడిభీమవరంలో ఒక రసాయనిక పరిశ్రమలో పనిచేసిన ఓ కార్మికుడు సోమవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు... విజయనగరం జిల్లాలోని రేగిడి మండలంలోని ఓ గ్రామానికి చెందిన కార్మికుడు కొద్దేళ్లుగారణస్థలంలో ఉంటున్నాడు. ఎప్పటిలాగే సోమవారం పరిశ్రమకు విధులకు వెళ్లాడు. పరిశ్రమల్లో కళ్లు తిరిగి పడిపోవడంతో చికిత్స నిమిత్త విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే కార్మికుడు మృతిపై కుటుంబ సభ్యులు ప్రభుత్వానుపత్రి వద్ద ఆందోళన చేశారు. ఆయన ఎలా మృతి చెందాడో తెలియాల్సి ఉంది.

చిట్టేవలసలో ఒకరిపై దాడి

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టేవలస గ్రామానికి చెందిన చింతు సూర్యనారాయణపై భార్యజోగమ్మ, కుమారుడు తులసిరావు దాడి సోమవారం దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు... సూర్యనారాయణ భార్య జోగమ్మ మధ్య మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. అయితే తమ వాటా ధాన్యం ఇవ్వాలని సూర్యనారాయణ ఇంటికి వెళ్లి భార్య కుమారుడు వెళ్లి అడిగారు. తాను వాటా ఇవ్వనని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని అనడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.దీంతో జోగమ్మ, కుమారుడు తులసిరావు కలిసి సూర్యనారాయణపై కర్రతో దాడి చేయడంతో తీవ్ర గాయపడ్డాడు. సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసు నమోదు చేశారు.

ఒకరి అదృశ్యంపై ఫిర్యాదు

జలుమూరు: జలుమూరులోని బీసీకాలనీలో నివసిస్తున్న సిగబడి కామరాజు (34) నెలరోజులుగా కనిపించడంలేదని భార్య బొసే తేజోవతి సోమవారం పోలీసులకు ఫిర్యాదుచేసింది.పోలీసుల కథనం మేరకు..పాలకొండ మండలంలోని రామభద్రరాజుపేట గ్రామానికి చెందిన కామరాజుతో 2022లో తేజోవతికి వివాహం జరిగింది. కామరాజుకు ఎవ్వరు లేకపోవడంతో జలుమూరు ఇల్లరికం వచ్చి ఉంటున్నాడు.లింగాలవలస దుర్గా ఫ్యామిలీ దాబాలో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఎనిమిది నెలల కిందట కుమారుడు జన్మించాడు.గత నెల 24న డ్యూటీకి వెళ్లిన కామరాజు ఇప్పటివరకు ఇంటికి చేరలేదు.ఇదివరలో కూడా ఇంటివద్ద చెప్పకుండానే బయటకు వెళ్లి వారంరోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. నెలరోజులు అవుతున్నా కామరాజు ఇంటికి రాకపోవడంతో బంధువులు ఇళ్లు, పరిసర ప్రాంతాల్లోను వెదికారు.ఈ నేపథ్యంలో పోలీసులకు తేజోవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ధర్మరాజు తెలిపారు.

108 మద్యం సీసాల స్వాధీనం

జి.సిగడాం: విజయనగరం జిల్లా వాసి నుంచి 108 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సామం తుల రామారావు తెలిపారు. మండలంలోని పాలఖండ్యాం కూడలి వద్ద సోమవారం తనిఖీలుచేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాలోని సంతకవిటి మం డలంలో గల మండాకురిటి గ్రామానికి చెందిన సాలిపల్లి మన్మథరావు 108 మద్యం సీసాలతో పట్టుబడ్డాడని చెప్పారు. వీటి విలువ రూ..15,200 ఉంటుందని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జనావాసాల్లోకి దూసుకెళ్లిన ట్యాంకర్

● కె.కొత్తూరు సర్వీసు రోడ్డులో తప్పిన పెనుప్రమాదం


ఇళ్ల వైపు దూసుకువెళ్లిన లారీ

టెక్కలి రూరల్: కె.కొత్తూరు జాతీయ రహదారి సమీపంలోని సర్వీసు రోడ్డులో సోమవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. కటక్ నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ ట్యాంకర్ ఒక్కసారిగా అదుపుతప్పి జనావాసాల్లోకి దూసుకువెళ్లింది. గ్రామస్థుల కథనం మేరకు.. కటక్ నుంచి విశాఖ వెళ్తున్న ట్యాంకర్ మండలంలోని కె.కొత్తూరు వద్ద అదుపుతప్పి జాతీయరహదారిపై నుంచి సర్వీసురోడ్డులోకి వచ్చి సమీపంలో ఇళ్లకు అతిదగ్గరగా దూసుకుపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమీపంలో విద్యుత్ స్తంభం కూడా ఉండడంతో పెద్దప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బందితో పాటు టెక్కలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన లారీ డ్రైవర్‌ను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని టెక్కలి సీఐ ఎస్.సూర్యచంద్రమౌళి తెలిపారు.

ఎస్పీ స్పందనకు 31 అర్జీలు

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జిఆర్ రాధిక సోమవారం నిర్వహించిన స్పందనకు 31 వినతులొచ్చాయి.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలకు చట్ట పరిధిలో పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు,జె.తిప్పే స్వామిలు పాల్గొన్నారు.


నరసన్నపేట: తామరాపల్లిలో బాబుష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణమూర్తి


టెక్కలి: లింగాలవలసలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

చంద్రబాబుతోనే భవిష్యత్‌కు గ్యారెంటీ

● బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకుల ప్రచారం


ఆమదాలవలస: బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న నాయకులు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే భవిష్యత్‌కు గ్యారెంటీ ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. బాండ్లు పంపిణీచేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను వివరించారు.

● **ఆమదాలవలస:** టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా న్యాయ విభాగ నాయకుడు తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. ఆమదాలవలస మునిసిపాలిటీలోని 13వ వార్డు విద్యానగర్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు తంగి గురయ్య, టిడిపి నాయకులు వేణుగోపాలవు, బాలు పాల్గొన్నారు.

● **కంచిలి:** టీడీపీ బలోపేతమే లక్ష్యంగా శ్రేణులు కష్టపడాలని టీడీపీ మండల కార్యదర్శి మాదిన రామారావు తెలిపారు. సోమవారం తలతంపరలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మద్రిపాటి పూర్ణ, ఇందు, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **నరసన్నపేట:** వచ్చేఎన్నికల్లో చంద్రబాబు నాయుడును సీఎంగా చేయాలని, ఈ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. తామరాపల్లిలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో మహిళ సాధికారతకు తామరాపల్లి ఆదర్శంగా నిలిచిందన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నాయకులు కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, గొద్దు జగన్మోహన్‌రావు, బైరి తవిటియ్య, కోల రాము పాల్గొన్నారు.

● **టెక్కలి:** వైసీపీ వైఫల్యాలను ప్రజలు ఎండగట్టాలని టీడీపీ మండల అధ్యక్షులు బగాదిశేషగిరి అన్నారు.లింగాలవలస పంచాయతీ పరిధి పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు అన్నెపు వాసు, బగాది సునీల్, నంబాళ్ల గోవిందరావు, సంపతిరావు భాస్కరరావు, జొన్న కామయ్య, సంజీవరావు, పృథ్విరాజ్, సింహాచలం, దాలయ్య, నారాయణ పాల్గొన్నారు.


కంచిలి: తలతంపరలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

● **ఎల్.ఎన్.పేట:** సీఎం జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిం దని, దీనిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి అన్నారు. శ్యామలాపురం జంక్షన్‌లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

బీసీలంటే జగన్‌కు చులకన భావం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


ఆమదాలవలస: మాట్లాడుతున్న కూన రవికుమార్

ఆమదాలవలస: సైకో సీఎం జగన్‌రెడ్డికి బీసీలు అంటే చులకన భావం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. సోమవారం ఆమదాలవలసలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు సంపతిరావు మురళీధరరావు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి రాష్ట్రంలో నామినేట్ పదవులు 671 రెడ్డిలను నియమిస్తే కేవలం ఐదు శాతం బీసీలకు ఇచ్చారన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని నలుగురు డీఎస్పీలో ఇద్దరిని రెడ్డిలను నియమించారని తెలిపారు. 56 మంది ముఖ్యమంత్రి సలహాదారుల్లో 27 మంది రెడ్డికులస్థులే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సైకోరెడ్డికి బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోర గోవిందరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కలగ జగదీష్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చింతాడ కృష్ణ, వాసుదేవరావు,జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, మునిసిపల్‌మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా, టీడీపీ మండలాధ్యక్షుడు నూకరాజు, అన్నెపు భాస్కరరావు, నాగళ్ల మురళీధర్, రాడ విజయ్‌కుమార్, పాగోటి తవుడు, కూన రాము పాల్గొన్నారు.

నేడు బాతుపురంలో 'జయహో బీసీ'

వజ్రపుకొత్తూరు: బాతుపురంలో మంగళవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతుశిరీష తదితరులు హాజరవుతారన్నారు. కార్యకర్తలు, నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీని బీజేపీ తొత్తు అనడం సరికాదు

● మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

అరసవల్లి: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల టీడీపీ బీజేపీ తొత్తుగా మారిందని అనడం సరికాదని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పల సూర్యనారాయణ హితవుపలికారు. సోమవారం అరసవల్లిలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్ర విభజనను వ్యతిరేకించారని, విభజన జరిగిన తర్వాత కూడా కేంద్రంలోని ప్రభుత్వాలను సమర్థించకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడ్డారన్నారు. ఆదే వైసీపీ రాష్ట్ర ప్రతిపత్తి అంశంగా ఎన్నికలకు వెళ్లి ప్రజలను నమ్మించి 22 మంది ఎంపీలను గెలిపించుకున్నాక కూడా ఏమీ చేయలేదని, కేంద్రాన్ని కనీసం ప్రశ్నించే ధైర్యం కూడా చేయలేదన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ప్రాధాన్యతగా చంద్రబాబు పనిచేశారని, ఏనాడు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రం ముందు తలవంచలేదన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి తొత్తుగా వ్యవరిస్తోందో లేదో వారినే ప్రశ్నించాలని కోరారు. రాష్ట్రం చేసిన అప్పుల విషయానికి వస్తే టీడీపీ ఎలా వ్యవహరించిందో, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఎలా ప్రవర్తిస్తోందో ప్రజలకు తెలుసని, వైసీపీ ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బీఎం రెగ్యులేషన్ అధిగమించడం రాష్ట్ర ఆర్థిక దుస్థితికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, ఐటీడీపీ అధ్యక్షుడు ప్రధాన విజయరాం పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం రూరల్ : ధర్మపురం గ్రామానికి చెందిన ఉప్పాడ సోమేష్ రెడ్డి (34) కుటుంబానికి పోలాండ్ తెలుగు అసోసియేషన్ అండగా నిలిచింది. ఈ మేరకు సోమేష్‌రెడ్డి గతనెల 17న పోలాండ్‌లో మరణించడంతో పోలాండ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి రామ్ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. 3.50 లక్షలు సేకరించారు.ఈమొత్తం సోమేష్‌రెడ్డి కుమార్తెపేరున ఎస్‌బీఐలో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు.ఆ బాండ్ పేపర్, ఇంటివద్ద ఖర్చుల నిమిత్తం మరో రూ.25 వేలు సోమవారం ధర్మపురంలోని సోమేష్ రెడ్డి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చందు, చంద్రబాను, ఎస్‌బీఐ ఏజెన్సీ మేనేజర్ పి.రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో రామాలయ నిర్మాణం

సరుబుజ్జిలి: తెలికిపెంటలో ప్రజలందరి సహకారంతో సీతారామాలయ నిర్మా ణానికి కృషిచేస్తామని సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు తెలిపారు. సోమవారం అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని తెలికిపెంటలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటుచేసి సీతారాముల చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

కంటి ఆపరేషన్ల కేసులు పూర్తి చేయాలి

అరసవల్లి: ఫిబ్రవరి నెలాఖరులోగా జగనన్న సురక్షలో కంటి ఆపరేషన్లకు నమోదైన కేసులను పూర్తిచేయాలని డీఎమ్‌హెచ్‌వో బి.మీనాక్షి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఎన్జీవో ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కంటిఅద్దాల పంపిణీ, కాటరాక్టు ఆపరేషన్లకు నమోదైనవారి వివరాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్, జెమ్స్, ఆరోగ్యవరం ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం


కరసేవకులను సన్మానిస్తున్న బెండాళం అశోక్

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగలో కరసేవకులకు ఎమ్మెల్యే బెండాళం అశోక్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలోఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనాడు లక్షలాదిమంది కరసేవకుల కృషి ఫలితంగా అయోధ్యలో రామమందిర నిర్మాణం జరుగుతోందన్నారు. కరసేవకుడు బల్లెడ కృష్ణారావు ఆనాటి జైలు అనుభూతి, అయోధ్యలో రామాలయ విధ్వంసం నుంచి నేటి వరకు జరిగిన సంఘటనలను రామభక్తులకు వివరించారు.

'కాంగ్రెస్ గురించి షర్మిలకు ఏం తెలుసు?'

శ్రీకాకుళం క్రైం: కాంగ్రెస్ గురించి పీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన షర్మిలకు ఏం తెలుసని, వైఎస్ మరణానంతరం ఆయన కుటుంబ సభ్యులను ఆ పార్టీ ఇబ్బంది పెట్టలేదా, ఏపీని అడ్డగోలుగా విభజించింది ఆ పార్టీ కాదా అని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్ష బాధ్యతల స్వీకరణ సందర్భంగా షర్మిల చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. అడ్డగోలుగా విభజించినందుకు కాంగ్రెస్ ఏపీలో అంశపయ్యపై ఉందని తెలిపారు. గతంలో ఏపీలో నోటాకంటే కాంగ్రెస్‌కు తక్కువ ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి హఠాత్తుగా షర్మిల ఎందుకు షిఫ్ట్‌అయ్యారో చెప్పాలని కోరారు. ఒకప్పుడు జగనన్న వదిలిన బాణాన్నిఅని బిల్డప్‌ఇచ్చి,ఇప్పుడు జగన్‌రెడ్డిఅని సంబోధించడంఎలాంటి నైతికత అని ప్రశ్నించారు.

డీలర్ కృష్ణది రాజకీయ హత్యే

● టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నవీన్‌కుమార్

శ్రీకాకుళం క్రైం: డీలర్ లోడ కృష్ణది ముమ్మాటికి రాజకీయహత్యేనని టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు దొండపాటి నవీన్ కుమార్ ఆరోపించారు సోమవారం రూరల్ మండలంలోని పొన్నాం పంచాయతీ నైరాలో ఉన్న కృష్ణ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్లగా మంత్రి ధర్మాన ప్రసాదరావు అనుచరుడిగా ఉండి రేషన్ డిపో ఇన్‌చార్జిగా ఉన్న కృష్ణకు ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో టీడీపీ నాయకుడు గొండుశంకర్ కృష్ణను పరామర్శించారని తెలిపారు. దీంతో కృష్ణ టీడీపీకి అనుకూలంగా ఉన్నాడని డిపో ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించి వేరొకరికి ఇవ్వడంతో మనస్తాపం చెంది మృతిచెందారని ఆరోపించారు. కేవలం టీడీపీకి సహకరిస్తున్నారన్న అనుమానంతో మంత్రి, ఆయన అనుచరులు కక్షపూరిత చర్యలకు పాల్పడడం వల్లే కృష్ణ మరణించారని విమర్శించారు. కృష్ణ కుటుంబానికి టీడీపీ అండగా నిలుస్తుందని భరోసాఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీలంశెట్టి తమ్మయ్య, జరుగుల లక్ష్మణరావు పాల్గొన్నారు.


కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

అక్రమ అరెస్టులు తగవు

● ఐసీడీఎస్ ప్రాజెక్టు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన

● 42వ రోజుకు చేరిన సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది అరెస్టులు చేయడం తగదని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కోటిసంతకాల సేకరించి జగనన్నకు చెబుదాం అని విజయవాడ బయలుదేరిన అంగన్‌వాడీలు నిర్బంధించడాన్ని ఖండించారు.ఈ మేరకు సోమవారానికి వారు చేపట్టిన సమ్మె 42వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. సమ్మెలో భాగంగా జై శ్రీరామ్‌స్మరణతో దీక్ష చేపట్టారు. జగన్మోహన్‌రెడ్డి ఆలోచన విధానాన్ని మార్చి తమ సమస్యల పరిష్కారానికి సహకరించే విధంగా ఆజ్ఞాపించాలని అంగన్‌వాడీలు భజనలు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


సరుబుజ్జిలి: శ్రీరామునికి పూజలుచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



టెక్కలి రూరల్: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆదిత్యుని దర్శించుకున్న ఏసీబీ కోర్టు న్యాయాధికారి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి (ఆదిత్యుని) వారిని విశాఖ ఏసీబీకోర్టు న్యాయాధికారి మురళీకృష్ణ సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు.ప్రధానఅర్చకుడు ఇప్పిలిశంకరశర్మ స్వాగతం పలికారు.అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.స్వామి వారిజ్ఞాపికను ఈవో హరిసూర్యప్రకాష్ అందజేశారు.

డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో ఐదో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 61కేంద్రాల్లో సుమారు 15 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. ఈ పరీక్షలు వచ్చే నెల మూడో తేదీ వరకు జరుగుతాయి.

శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి,మహిళాసాధికారిత కేంద్రంలో వివిధ వృత్తి కోర్సుల్లో శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు జిల్లా మేనేజర్ కె.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల్లో పదో తరగతి, ఆపైన ఉత్తీర్ణులై 18-40 ఏళ్ల లోపు మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణకు విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్ట్ పోర్ట్ సైజు ఫోటోలతో ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేయాలని తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఫోన్ నెంబర్లు 83339 21337, 74167 64419, 99485 30183కు సంప్రదించాలని కోరారు.

సమయపాలన పాటించాలి: వీసీ


మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని బోధనేతర సిబ్బంది సమయపాలన పాటించాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు.సోమవారం వర్సిటీలోని బోధనేతర సిబ్బందితోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పాదర్శకంగా సేవలందించి వర్సిటీకి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.కార్యక్రమంలోవర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.

టీఆర్‌ఎఫ్ ప్లాటినం అవార్డులు

సోంపేట: సోంపేట రోటరీక్లబ్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు రోటరీ ప్రముఖులు అభినందిస్తూ అవార్డులను అందించారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన రోటరీడిస్ట్రిక్ 3020 స్నేహం కాన్ఫరెన్స్‌లో భాగంగా సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి పీవీ కృష్ణారావులను అభినందిస్తూ టీఆర్‌ఎఫ్ ప్లాటినం అవార్డులను అందజేశారు.

చీమలవలసలో వికసిత్ భారత్

ఆమదాలవలస: మండలంలోని చీమలవలస, చింతలపేటల్లో సోమవారం వికసిత్‌భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం పైడి కూర్మారావు, ఆమదాలవలస నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు చింతాడ అప్పారావు, కార్యదర్శి రాము పాల్గొన్నారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

సోంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంచనా బడ్జెట్ 2024-25 సంవత్సరానికి గాను ఆమోదించారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు, ఎంపీడీవో బెండాళం వెంకటరమణ పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

కలెక్టరేట్: స్పందనలో వచ్చే అర్జీలను అలసత్వం వహించకుండా సత్వర పరిష్కారం చూపాలని డీఆర్వో ఎం.గణపతిరావు కోరారు. సోమవారం స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో ఆయన ఉప కలెక్టర్ జయదేవితో కలిసి 175 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత సమయంలోగా అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, ఉద్యానశాఖ ఏడీ ప్రసాదరావు, డీఎమ్‌హెచ్‌వో మీనాక్షి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితా

కలెక్టరేట్: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా అందు బాటులో ఉంటుందని శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీ, కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో ఓటరు జాబితాలను శ్రీకాకుళం నియోజకవర్గంలోని 279 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ చేసినట్లు పేర్కొన్నారు.